# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



ఫిర్యాదులను పరిశీలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక



ఫిర్యాదుదారుల సమస్యను అడిగి తెలుసుకుంటున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

- ఫిర్యాదులను స్వీకరించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్
- రంగారెడ్డి జిల్లాలో 95, వికారాబాద్ జిల్లాలో 178 దరఖాస్తులు
- దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించిన ఇరు జిల్లాల కలెక్టర్లు

రంగారెడ్డి, జూలై 22 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 95 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, డీఆర్‌వో సంగీతతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వివిధ శాఖలలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ కార్యాలయ విధులకు సమయానికి రావాలని ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లాలో 178 దరఖాస్తులు..

వికారాబాద్, జూలై 22 : ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 178 మంది దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 178 అర్జీలు రాగా భూ సర్వే, పింఛన్, ఇతర భూ సమస్యలకు సంబంధించినవి, ఇతర శాఖలకు సంబంధించినవి దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో పనిచేసే ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు. మీ పరిధిలో ఉండే మండలాల్లో పర్యటించి ఏఏ పనులు జరుగుతున్నాయి, ఇంకా జరగాల్సిన పనులు, పెండింగ్‌లో ఉన్న పనులను తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఇన్‌చార్జి లోకల్ బాడీస్ సుధీర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యా నాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, ఆర్డీవో వాసు చంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన సేవలందించాలి

– డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్



బొంరాస్‌పేట పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్

బొంరాస్‌పేట, జూలై 22 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది రోగులపై సానుకూల దృక్పథంతో ఉండాలని, విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పల్వన్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న మందులను అడిగి తెలుసుకున్నారు. సాధారణ వార్డు, డెలివరీ వార్డులను పరిశీలించి డెలివరీ వార్డులో ఉండే అత్యవసర మందులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను మెడికల్ ఆఫీసర్ హేమంత్‌ను, రోగులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, ఏదైనా అనారోగ్య సమస్య తీవ్రంగా ఉంటే తగు సూచనలతో పాటు జిల్లా దవాఖానకు పంపించాలన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం కింద బొంరాస్‌పేట పీహెచ్‌సీలో పైలట్ ప్రాజెక్టుగా 0 నుంచి 18 సంవత్సరాల్లోపు పిల్లల్లో ఉండే పుట్టుకతో వచ్చే లోపాలు, వంశపారంపర్యంగా వచ్చే లోపాలు, పెరుగుదల లోపాలను గుర్తించడం కోసం ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలకు మంగళవారం ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో శిక్షణా కార్యక్రమానికి రైతు వేదికలో ఏర్పాట్లు చేస్తుండగా డీఎంహెచ్‌వో పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్ర యాదవ్, డెమో శ్రీనివాస్, సిబ్బంది సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## చాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, మాస్టర్ చెన్నయ్య

షాద్‌నగర్‌టౌన్, జూలై 22 : హైదరాబాద్‌లోని కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం అంతర్జాతీయ మార్షల్‌ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో షాద్‌నగర్ పట్టణ పరిధిలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబర్చారు. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ రాష్ట్ర స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు, మాస్టర్ చెన్నయ్య మాట్లాడుతూ ఈ మార్షల్‌ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలను శాలివన్ టైగర్ కుంగ్‌ఫూ ఇంటర్నేషనల్ ఫౌండర్, డైరెక్టర్ కన్నన్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. అండర్-19 స్పైరింగ్ విభాగంలో విద్యార్థినులు మమత, గీత, విజయలక్ష్మి గోల్డ్ మెడల్స్ సాధించారని పేర్కొన్నారు. కథాస్ విభాగంలో విద్యార్థినులు అంకిత, ఈరమ్మ, ఐశ్వర్య ఉత్తమ ప్రతిభను కనబర్చి మెడల్స్‌ను సాధించినట్లు తెలిపారు. అంతర్జాతీయ మార్షల్‌ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మెడల్స్‌ను సాధించిన విద్యార్థినులను, మాస్టర్ చెన్నయ్యను కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, అధ్యాపకులు ఆశాజ్యోతి, విజయలక్ష్మి, రాజ్యలక్ష్మి, రజిని, మంజుల, మాణిక్యమ్మ, నలిని, మృధుల, లక్ష్మి అభినందించారు. మరింత పట్టుదలతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. విద్యార్థినులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థినులకు ప్రోత్సాహాన్ని అందిస్తే వారు మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని వివరించారు.

## నకిలీ ఆదాయ సర్టిఫికెట్లు సృష్టించిన వ్యక్తులు రిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ బాబ్యానాయక్

మంచాల, జూలై 22 : నకిలీ ఆదాయ సర్టిఫికెట్లను సృష్టించిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచాల సీఐ బాబ్యానాయక్ తెలిపారు. సోమవారం మంచాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ మంచాల తహసీల్దార్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న పురం సురేష్ స్థానికేతరులకు నకిలీ ఆదాయ సర్టిఫికెట్లను ఇస్తూ మోసం చేస్తున్నాడని చెప్పారు. కంప్యూటర్ ఆఫరేటర్ అయిన సురేష్ బాబుతో పాటు నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ఉన్న లక్ష్మి మీసేవ నిర్వాహకుడు పత్తి రవి కుమార్, అదేవిధంగా వీరికి మధ్యవర్తిగా వ్యవహరించిన గోరు రవి కుమార్ ఫోన్ నంబర్‌తో నగరానికి చెందిన కొంత మందికి నకిలీ ఆదాయ సర్టిఫికెట్లను అతడి ఫోన్‌నంబర్‌పైనే దరఖాస్తు చేసేవాడని పేర్కొన్నారు. మీసేవ ద్వారా దరఖాస్తు చేసిన విషయాన్ని మధ్యవర్తిగా వ్యహరిస్తున్న రవి కుమార్ మంచాల తహసీల్దార్ కార్యాలయంలో ఆపరేటర్‌గా పని చేస్తున్న సురేష్ బాబుకు తెలియజేయడంతో వెంటనే ఆ దరఖాస్తులను ఎటువంటి ఎంక్వయిరీ చేయకుండా, కనీసం తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లకుండా నేరుగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి నగరంలో ఉన్న మీసేవ ద్వారా స్థానికేతరులకు సర్టిఫికెట్లను అందజేసేవారు. ఈ తతంగం కొంత కాలంగా కొనసాగుతున్న విషయం ఎవరి దృష్టికి వెళ్లకుండా జాగ్రత్త పడేవారని తెలిపారు. ఈ వ్యవహారంలో డబ్బులు బాగానే గుంజేవారని చెప్పారు. మంచాల తహసీల్దార్ కేవీవీ ప్రసాద్ రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐ రజినీకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జేఎల్, డీఎల్‌గా పదోన్నతులు సాధిస్తాం

పీఆర్‌టీయూటీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్



చేవెళ్ల బాలికల పాఠశాలలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న పీఆర్‌టీయూటీఎస్ నాయకులు

చేవెళ్లటౌన్, జూలై 22 : ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి ఉపాధ్యాయులకు జేఎల్, డీఎల్‌గా పదోన్నతులు సాధిస్తామని పీఆర్‌టీయూటీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్ తెలిపారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో పీఆర్‌టీయూటీఎస్ సభ్యత్వ నమోదు వారోత్సవాలను పీఆర్‌టీయూటీఎస్ జిల్లా శాఖ అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఏకీకృత సర్వీసు రూల్స్‌ను సాధించి ఉపాధ్యాయులకు ఎంఈవోలు, జేఎల్, డైట్ లెక్చరర్‌గా ప్రమోషన్లను ఇప్పిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను 50 శాతం ఫిట్మెంట్ ఇప్పిస్తూ పీఆర్‌సీ ఏర్పాటు ఇప్పిస్తామన్నారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో మిగిలిన లెఫ్ట్ ఓవర్ వేకెన్సీల్లో అర్హత గల ఉపాధ్యాయుల చేత నింపుతామన్నారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఎల్లవేళలా పోరాడుతుందన్నారు. 317 జీవోలోని సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మండల పీఆర్‌టీయూటీఎస్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వలస కూలీల పిల్లలందరూ బడికి రావాలి




అంకిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, మాట్స్‌లు పంపిణీ

వికారాబాద్, జూలై 22 : వలస కూలీల పిల్లలందరూ నిత్యం బడికి వచ్చి చదువుకోవాలని అంకిత ఫౌండేషన్ వికారాబాద్ డివిజన్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం వికారాబాద్ మండల పరిధిలోని శ్రీరామ్‌నగర్, జాంబపూర్ తండా, కొట్టంగుట్టతండా, మద్దులగడ్డతండాల్లోని ప్రాథమిక పాఠశాలల్లోని 105 మంది విద్యార్థులకు అంకిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, మాట్స్, చెప్పులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద తల్లిదండ్రులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో పిల్లల చదువును మధ్యలోనే నిలిపివేస్తున్నారన్నారు. అలాంటి చిన్నారులను గుర్తించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్క వలస కూలి, భవన నిర్మాణ కార్మికులు ఈ శ్రమ్ కార్డులు, లేబర్ కార్డు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని, వాటిని లబ్ధి పొందాలి అంటే ఈ శ్రమ్ కార్డు, లేబర్ కార్డు తప్పనిసరి అవసరమని తెలిపారు. పది సంవత్సరాల్లోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మురళి, వరలక్ష్మి, మహేందర్, బొగేష్ చంద్రయ్య, అంకిత ఫౌండేషన్ వికారాబాద్ మండల కోఆర్డినేటర్ సంజీవరావు, అంగన్‌వాడీ టీచర్లు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, డ్వాక్రా మహిళలు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నాగన్‌పల్లిలో ప్రభుత్వ భూమిని కాపాడాలి

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన నాగన్‌పల్లి గ్రామస్తులు

ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 22 : మండల పరిధిలోని నాగన్‌పల్లి గ్రామంలో గల సర్వేనంబర్ 297, 298లల్లో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి నాగన్‌పల్లి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కబ్జాదారులు ఎక్కువయ్యారని, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నవారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కబ్జాకు గురవుతున్న భూమిని కాపాడి గ్రామపంచాయతీకి అప్పగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జగన్, బీరప్ప, ఐలయ్య, బాలయ్య, కాటం తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాగన్‌పల్లి గ్రామస్తులు

## గ్రామపంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్(సీఐటీయూ) యూనియన్ డిమాండ్



రంగారెడ్డి కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

రంగారెడ్డి, జూలై 22 (నమస్తే తెలంగాణ) : గ్రామపంచాయతీ సిబ్బందికి సంబంధించిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్(సీఐటీయూ) యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ తరపున సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంకకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది గత 5, 6 నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల విడుదల కోసం ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకుండాపోయిందన్నారు. సిబ్బంది వేతనాలకు సంబంధించి రూ.150 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించి ఉత్తర్వులను మాత్రమే ఇచ్చిందని, నేటికీ ఏ ఒక్క గ్రామపంచాయతీకి కూడా నిధులు జమ కాలేదని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ జిల్లా నాయకులు పోచమోని కృష్ణ, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు జె.జంగయ్య, జిల్లా కోశాధికారి దేవదాస్, నరేష్ తదితరులు ఉన్నారు.

## 3 వరకు ఇంటింటా ఇన్నోవేటర్‌కు దరఖాస్తులు

- కలెక్టర్ ప్రతీక్ జైన్



ఇన్నోవేటర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూలై 22 : స్థానిక సమస్యలను పరిష్కరించే వినూత్న ఆవిష్కరణలకు అవకాశం ఇంటింటా ఇన్నోవేటర్ కల్పిస్తున్నదని, దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 3 చివరి గడువు అని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశం హాలులో ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సమస్యలను పరిష్కరించే వినూత్న ఆవిష్కరణలు పంపించే అవకాశం ఇంటింటా ఇన్నోవేటర్ కల్పిస్తున్నదని తెలిపారు. ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ ప్రోగ్రాం ఏర్పాటు చేసిందన్నారు. గృహిణి నుంచి పాఠశాలలు, కళాశాలలు స్థాయి విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యవసాయదారులు ఇలా ఎవ్వరైనా ఇందులో పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసు చంద్ర, ఇన్నోవేషన్ మిత్ర వినీత్ సిధార్ తదితరులు పాల్గొన్నారు.

**దరఖాస్తు చేసుకొనే విధానం..**

- పేరు, వయస్సు, ఫొటో, వృత్తి, చిరునామా, మండలం, జిల్లా, ఆవిష్కరణ పేరు
- ఆవిష్కరణ వివరిస్తూ 100 పదాల్లో రాసి పంపాలి, ఆవిష్కరణకు సబంధించి 4 ఫొటోలు
- ఆవిష్కరణ వీడియో 2 నిమిషాలు
- తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబర్ 9100678543కు ఆగస్టు 3వ తేదీ లోగా పంపించాలి.
- ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుంది.

## పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలి



రుణ మాఫీ అయిన రైతులతో మాట్లాడుతున్న డీఏవో గోపాల్

వికారాబాద్, జూలై 22 : రుణాలు మాఫీ అయిన రైతులు సంబంధిత బ్యాంకుల్లో తప్పనిసరిగా రెన్యూవల్ చేసుకోవాలని డీఏవో గోపాల్ తెలిపారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో రుణాలకు సంబంధించిన పలు వివరాలు తెలుసుకున్నారు. ధారూరు మండలం కెరెళ్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా డీఏవో గోపాల్ మాట్లాడుతూ రెన్యూవల్ చేసుకున్న వారికి కొత్త రుణాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులు ఇట్టి విషయాలపై అవగాహన పెంచుకొని, రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. వారి వెంట ఏఈవో అనీల్‌కుమార్, వ్యవసాయాధికారులు ఉన్నారు.